సెలవు పెడితే బడి బంద్


ఇది మండలంలోని సవాతి గ్రామపం చాయతీ పరిధి అంతాపూర్ గ్రామంలో గల గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల. ఈ గ్రామంలో సుమారు 15 మంది ఆదివాసీ బడీడు పిల్లలు ఉండగా ఒక ఉపాధ్యాయుడు ఉండేవారు. ఉపాధ్యాయుడు ఇటీవల బదిలీపై వేరే పాఠశాలకు వెళ్లగా గత నాలుగు రోజుల నుంచి బడి తలుపులు తెరుచుకోవడం లేదు.


ఇది ధాబా గ్రామ పంచాయతీ కేంద్రం లోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల. ఈ పాఠశాలలో ఒకే ఉపాధ్యాయుడు పని చేస్తుండగా శనివారం ఆయన పాఠశాలకు హాజరు కాలేదు. పాఠశాలకు వేరే ఉపాధ్యాయుడిని కేటాయించకపోవడంతో గ్రామంలోని బడి పిల్లలు వీధుల వెంట తిరుగుతూ కన్పించారు.

- 'గిరి' బిడ్డల విద్యకు భరోసా కరువు
- ఒకేరోజు సెలవులో వివిధ టీడబ్ల్యూపీఎస్ ఉపాధ్యాయులు
- అంతపూర్‌లో నాలుగు రోజులుగా తెరుచుకోని బడి తలుపులు
- విద్యకు దూరమవుతున్న ఆదివాసీ బిడ్డలు
- పట్టించుకోని అధికారులు


బండకాసలోని పాఠశాల

వాంకిడి: ఆదివాసీల అభివృద్ధి చదువుతోనే సాధ్యపడుతుందని నమ్మిన ప్రభుత్వం మారుమూల గ్రామాల్లోనూ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేసింది. గ్రామాల్లో ఒకరిద్దరు పిల్లలున్నా వారికి తప్పనిసరిగా నాణ్యమైన విద్య అందించాలని ఏకోపాధ్యాయ పాఠశాలలను సైతం మంజూరు చేసింది. టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలు ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతుండగా ఆ పాఠశాలల్లో పని చేస్తున్న కొందరు ఉపాధ్యాయులు మాత్రం గిరి పిల్లల చదువుపై అనుకున్న స్థాయిలో దృష్టి సారించడం లేదు. ఉపాధ్యాయులు పాఠశాలలకు విధిగా హాజరయ్యేలా, బడి బయటి పిల్లలు లేకుండా పర్యవేక్షించాల్సిన అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పాఠశాలకు దుమ్మా కొట్టే ఉపాధ్యాయులకు సహకరిస్తూ 'మామూళ్ల' మత్తులో అధికారులు తూగుతున్నట్లు తీవ్రమైన ఆరోపణలు విన్పిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యానికి మండలంలోని ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో చదువుకునే పిల్లలు తీవ్రంగా నష్టపోతున్నారు.

చదువుకు దూరంగా..
మండలంలోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలపై అధికారులు చిన్నచూపు ఆదివాసీ పిల్లల విద్యపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నిత్యం పాఠశాలలకు హాజరై బోధించాల్సిన ఉపాధ్యాయులు విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా వివిధ కారణాలు చూపుతూ సెలవులు తీసుకుంటున్నారు. పాఠశాలల నిర్వహణను గాడిలో పెట్టాల్సిన అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నారు. ఏదైనా ఏకోపాధ్యాయ పాఠశాల ఉపాధ్యాయుడు తప్పని పరిస్థితిలో సెలవు కోరితే ఒకరోజు ముందే కాంప్లెక్స్ హెచ్‌ఎంకు సమాచారం అందించాల్సి ఉంటుంది. దీని ద్వారా ఆ పాఠశాల విద్యార్థులు నష్టపోకుండా ఇతర పాఠశాలలోని ఉపాధ్యాయులను సదరు పాఠశాలకు కేటాయిస్తారు. కానీ మండలంలోని టీడబ్ల్యూపీఎస్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఇష్టారీతిన సెలవులు ఇవ్వడం, తీసుకోవడం చేస్తున్నారు. దీంతో కొన్ని రోజుల పాటు పాఠశాలల తలుపులు తెరుచుకోక ఆదివాసీ పిల్లలు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఉపాధ్యాయుడిని కేటాయించాలి



మా గ్రామ పాఠశాల ఉపాధ్యాయుడు ఇటీవల బదిలీపై వెళ్లారు. దీంతో గత నాలుగు రోజుల నుంచి మా గ్రామానికి వేరే సారు ఎవరూ రావడం లేదు. గ్రామంలో సుమారు 12 నుంచి 15 మంది బడీడు పిల్లలు ఉన్నారు. అధికారులు స్పందించి విద్యార్థులు నష్టపోకుండా వెంటనే ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలి.

– బిలాజీ, అంతాపూర్ గ్రామ పటేల్

శనివారం ఇలా..
శనివారం ఉదయం మండలంలోని వివిధ గ్రామాల్లో 'సాక్షి' పర్యటించగా పలు గ్రామాల్లోని గిరిజన సంక్షేమ పాఠశాలలకు తాళం వేసి ఉండటం గమనార్హం. సవాతి గ్రామ పంచాయతీ పరిధిలోని పాఠశాల ఉపాధ్యాయుడు ఇటీవల బదిలీపై వెళ్లగా గత ఐదు రోజుల నుంచి పాఠశాలకు వేరే ఉపాధ్యాయుడిని కేటాయించలేదు. దీంతో బడి తలుపులు తెరుచుకోలేదు. ధాబా జీపీలోని బండకాస గ్రామంలో ఉన్న పాఠశాల గత రెండు రోజుల నుంచి తెరుచుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. అలాగే దొడ్డిగూడ జీపీలోని ఎనగొంది పాఠశాల ఉపాధ్యాయుడు ఇటీవల బదిలీ కాగా మరో ఉపాధ్యాయుడు బాధ్యతలు స్వీకరించారు. కానీ బాధ్యతలు తీసుకున్నప్పటి ఆ పాఠశాల తలుపులు మాత్రం తెరుచుకోలేదు. దీనిపై వాంకిడి ఎస్‌సీఆర్పీ రాజేశ్వర్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరగా బండకాస, ధాబా, ఎనగొంది పాఠశాలల ఉపాధ్యాయులు సెలవుల్లో ఉన్నట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌ను వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా సంప్రదించగా స్పందించలేదు. 'సాక్షి' పరిశీలనలో శనివారం ఒకేరోజు నాలుగు గిరిజన ప్రాథమిక పాఠశాలలు మూతపడి ఉండటం ఆదివాసీ పిల్లల భవిష్యత్తుపై ఆందోళన కల్గిస్తుంది.

ఉపాధ్యాయులను కేటాయించరూ..!


పాఠాలు బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్

తిర్యాణి: మండలంలోని చింతలమాదర గ్రామంలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో 22 మంది విద్యార్థులుండగా ఇద్దరు ఉపాధ్యాయులు విద్యా బోధన చేసేవారు. కాగా అందులో ఒక ఉపాధ్యాయుడు తుకారం గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. మరో ఉపాధ్యాయుడు హనుమంత్ రావు ఇటీవల వేరే పాఠశాలకు బదిలీ అయ్యారు. కాగా ఒకే భవనంలో పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతుండగా ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్ తుంరం కవిత పాఠశాల విద్యార్థులకు సైతం విద్యా బోధన చేస్తున్నారు. కాగా గతంలో మాదిరిగానే పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎస్‌సీఆర్పీ కైలాశ్‌ను వివరణ కోరగా ఖాళీగా ఉన్న పోస్టులపై ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశామని, త్వరలోనే ఉపాధ్యాయులు నియమితులయ్యే అవకాశం ఉందన్నారు.

'రీ సర్వే చేపట్టాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో ఆసిఫాబాద్ మున్సిపాలిటీ, రాజంపేట గ్రామపంచాయతీల ఏర్పాటుకు సంబంధిత అధికారులు చేపట్టిన సర్వేను తిరిగి మరోసారి నిర్వహించాలని ఆసిఫాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంధం శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ఉన్న రాజంపేట ప్రాంతాన్ని యథావిధిగా కొనసాగించాలని, ఇప్పటి వరకు చేపట్టిన సర్వేలో కొంత అవకతవకలు జరిగాయని ఆరోపించారు. తిరిగి సర్వేను న్యాయబద్ధంగా జరిపించాలని కోరారు.

క్లుప్తంగా

ఉపకరణాలు అందేలా చూడాలి

ఆసిఫాబాద్‌రూరల్: ప్రత్యేకావసరాలు గల పిల్లలకు ఉపకరణాలు అందేలా విలీన విద్యా రిసోర్స్ పర్సన్లు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో అల్లింకో వారితో నిర్వహించిన ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లల ఉపకరణాల శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రత్యేకావసరాలు గల పిల్లలను గుర్తించి వారికి ఉపకరణాలు అందించడానికి ఐఆర్పీలు కృషి చేయాలని ఆదేశించారు. తల్లిదండ్రులు పిల్లలను బడిలో చేర్పించి విద్య, ఉపాధి అవకాశాలు దక్కేలా చూడాలని సూచించారు. డీఈవో అశోక్ మాట్లాడుతూ.. ప్రత్యేకావసరాలు గల పిల్లల కోసం భవిత కేంద్రాలు ఐఆర్పీలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. వారికి తగిన ఉపకరణాలు అందిస్తున్నామని తెలిపారు. అదనపు కలెక్టర్ దిపక్ తివారి, జిల్లా సైన్స్ అధికారి మధుకర్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన పాదయాత్ర


సమస్యలు తెలుపుతున్న పెందూర్ ధర్ము

తిర్యాణి: కనీస వసతులు కరువై మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న మండల కేంద్రం నుంచి ఆదివాసీ నాయకుడు చేపట్టిన పాదయాత్ర శనివారం ముగిసింది. మండల కేంద్రానికి పెందూర్ ధర్ము గాంధీ వేషధారణలో జాతీయ జెండా చేతపట్టుకుని తిర్యాణి నుంచి సీఎం క్యాంపు కార్యాలయం వరకు మహాపాదయాత్ర చేపట్టారు. తొమ్మిదోరోజు పాదయాత్ర సిద్దిపేట వరకు చేరింది. కాగా, సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలు విన్నవించేందుకు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఇచ్చిన హామీ మేరకు పాదయాత్ర విరమించినట్లు ధర్ము తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి ఓఎస్డీకి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం సీఎం ఢిల్లీ పర్యటనలో ఉన్నారని, హైదరాబాద్‌కు వచ్చాక ముఖ్యమంత్రిని కలిసి సమస్యలు విన్నవిస్తానని పేర్కొన్నారు.

ఎంపీని సన్మానించిన బీజేపీ నాయకులు


ఎంపీ నగేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ గోడం నగేశ్‌ను పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి జయరాం ఆధ్వర్యంలో శనివారం జిల్లాకేంద్రంలోని మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు నివాసంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, మాజీ ఎంపీపీ మల్లిఖార్జున్, అసెంబ్లీ ఇన్‌చార్జి కోట్నాక విజయ్‌లు ఘనంగా సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం కేంద్రం నుంచి అధిక నిధులు మంజూరు చేయించాలని కోరారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కలిసికట్టుగా కృషి చేయాలని ఎంపీ నగేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నితిన్, నిఖిల్, రాహుల్, శివయ్య, జాన్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం ప్రత్యేకాధికారిగా సజీవన్


బాధ్యతలు స్వీకరిస్తున్న సజీవన్

దహెగాం: మండల ప్రత్యేకాధికారిగా శనివారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సజీవన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పంచాయతీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో రాజేందర్, ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్, ఈజీఎస్ ఏపీవో కల్పన, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి
సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి సజీవన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులు అందుబాటులో ఉన్నాయా అని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వ్యాధులు ప్రబలితే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీడీవో రాజేందర్, వైద్యాధికారి నరేందర్ తదితరులు ఉన్నారు.

'రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం'


మాట్లాడుతున్న నాయకులు

రెబ్బెన: రెబ్బెన పీఏసీఎస్‌లో అవినీతి జరిగినట్లు విచారణలో తేలితే అవినీతికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని రైతులకు న్యాయం జరిగేలా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పోరాడుతామని పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, వైస్‌చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్‌లు అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రైతుల పేరు చెప్పి మండలానికి చెందిన కొంతమంది బీజేపీ నాయకులు తమ స్వలాభం కోసం రైతువేదిక వద్ద పీఏసీఎస్ పాలకవర్గంపై చేసిన అసత్యపు ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. బీజేపీ నాయకులకు కనీస అవగాహన లేకుండా బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో మాజీ ఎంపీపీ సౌందర్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాబురావు, మాజీ సర్పంచులు, మాజీ ఉప సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

సూపర్‌బజార్ వినియోగంలోకి తీసుకురావాలి


మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు


రెబ్బెన: సింగరేణిలో పని చేసే ఉద్యోగులకు నాణ్యమైన నిత్యవసర సరుకులను తక్కువ ధరలకే అందించేందుకు ఏర్పాటు చేసిన సింగరేణి సూపర్ బజార్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ కోరారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి సూపర్ బజార్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఏరియాలో ప్రస్తుతం ఒకే ఒక్క ఓసీపీ కొనసాగుతున్నప్పటికీ అధికారులు, కార్మికులు, స్థానికేతరులు అంతా కలిసి సుమారు 7000లకు పైగా జనాభా నివసిస్తున్నారన్నారు. స్థానిక సూపర్‌బజార్‌లో సుమారు 200 మంది ఖాతాదారులు ఉన్నారని, రెండేళ్ల క్రితం గోలేటి సూపర్‌బజార్‌ను అధికారులు మూసివేశారన్నారు. జీఎం ప్రత్యేక చొరవ తీసుకొని సూపర్ బజార్‌ను తెరిపించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ నాయకులు సంగెం ప్రకాశ్‌రావు, నాయకులు సదాశివ్, కుమారస్వామి, లస్మయ్య పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసమే భరోసా సెంటర్లు


అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్

రెబ్బెన: మహిళలు, పిల్లల రక్షణ, భద్రత కోసమే షీ టీం, భరోసా సెంటర్లు పని చేస్తున్నాయని షీటీం ఇన్‌చార్జి ఎస్సై వెంకటేశ్వర్ అన్నారు. శనివారం రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళలు, పిల్లల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల విద్యార్థులకు మహిళలు, పిల్లలపై జరుగుతున్న లైంగిక నేరాలు, వాటిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలు, మహిళలను ఇబ్బందులకు గురి చేసే వారిపై చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సమస్య ఉంటే బాధితులు డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. పరిచయం లేని కొత్త వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో షీటీం సిబ్బంది సునీత, స్వప్న, శ్రీలత, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రకాశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదవడం ఎలా..?


ఉరుస్తున్న భవనంలో పత్రికలు చదువుతున్న పాఠకులు

కౌటాల మండల కేంద్రంలోని గ్రంథాలయ భవనం వానకు ఉరుస్తుండడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు అనేక మంది ఈ గ్రంథాలయంలో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. వర్షం పడుతున్నప్పుడు భవనం పైకప్పు నీరు కారుతుండడంతో పుస్తకాలు తడుస్తున్నాయని వారు వాపోతున్నారు. భవనం కూడా పూర్తిగా తడిగా ఉంటుందని.. అధికారులు గ్రంథాలయం అభివృద్ధిపై ఎలాంటి శ్రద్ధ చూపడం లేదని ఆరోపిస్తున్నారు. - కౌటాల


తడిసిన పుస్తకాలు

తడారని 'పత్తి'

- వీలుకాని సస్యరక్షణ చర్యలు
- విపరీతంగా పెరిగిన కలుపు మొక్కలు
- కూలీల కొరతతో ఇబ్బందులు
- ఆందోళనలో రైతులు


తలోడి శివారులో పత్తి పంటలో పెరిగిన కలుపు


గురుడుపేట శివారులో తడారని పత్తి చేను

కౌటాల: ప్రకృతి రైతాంగాన్ని పగబట్టింది. పత్తి పంట సాగు చేస్తున్న రైతులకు ఏటా అతి, అనావృష్టితో కష్టాలు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వరద ముంపుతో పంటలు దెబ్బతినగా, చేలల్లో నీటి తడి ఆరకుండా విపరీతంగా కలుపు పెరిగింది. పత్తి మొక్కలు చీడపీడల బారినపడుతున్నాయి. సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు సైతం వెసులుబాటు లేకపోవడంతో పంటల్లో కలుపు విపరీతంగా పెరిగి దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలో కలుపుతీతకు కూలీలు దొరక్క అన్నదాతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

4.50 లక్షల ఎకరాల్లో సాగు
జిల్లాలోని 1.16 లక్షల మంది రైతులు జిల్లా వ్యాప్తంగా 4.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో అత్యధికంగా 3.40 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేయనున్నారు. జూన్ చివరిలో కురిసిన వర్షాలకు రైతులు పత్తి విత్తనాలు విత్తుకోగా మొలకెత్తాయి. అనంతరం జూలై చివరి వారం నుంచి విస్తారంగా వర్షాలు కురవడంతో పత్తి పంటలో విపరీతంగా కలుపు పెరిగింది. నీటి నిల్వతో మొక్కలు కొన్ని పచ్చగా మారి ఎదుగుదల లోపించింది. ఎటుచూసినా కలుపుతో పంట చేలు గడ్డి మైదానాలను తలపిస్తున్నాయి. వర్షాలు తగ్గి భూమి తడి ఆరితే తప్ప కలుపు తీయలేని పరిస్థితి నెలకొంది.

కలుపు భారం
ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి పత్తి చేనుల్లో కలుపు మొక్కలు పెరగడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. కూలీల కొరత కారణంగా పత్తి రైతులు కలుపుతీతకు మందులపై ఆధారపడుతున్నారు. రూ.వేలు వెచ్చించి కలుపు మందులు పిచికారీ చేస్తున్నారు. పత్తి మొక్కల కంటే కలుపు మొక్కలే ఎక్కువగా ఉండటంతో ఎకరాకు 25 నుంచి 30 మంది వరకు కూలీలు అవసరం పడుతున్నారు. దీనికి తోడు గతంలో రోజు వారీ కూలి ఒక్కొక్కరికి రూ.200 ఉండేది. ప్రస్తుతం రూ.300 వరకు కూలీలకు చెల్లిస్తున్నారు. దీంతో పెరిగిన ఖర్చులతో ఎకరాకు కనీసం 25 మంది కూలీలకు గానూ రూ.7500 ఖర్చవుతుంది. అలాగే ప్రస్తుతం గ్రామాల్లో వరి నాట్లు వేస్తుండడంతో కూలీలు దొరకడం లేదు. పెరుగుతున్న ఖర్చులను దృష్టిలో పెట్టుకున్న రైతులు వ్యవసాయం చేయాలంటేనే జంకుతున్నారు. వర్షాలు తగ్గిన తర్వాత కలుపు తీసి ఎరువుల యాజమాన్య చర్యలు చేపడితే పత్తి మొక్కల్లో ఎదుగుదల ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

కలుపుతో ఖర్చులు పెరిగాయి

భారీ వర్షాలు కురవడంతో పత్తిలో కలుపు మొక్కలు పెరిగాయి. దీంతో పంటలకు ఎరువులు వేసినా పోషకాలను కలుపు మొక్కలు హరిస్తున్నాయి. ఎకరం పత్తి చేనులో కలుపు తీయడానికి అదనంగా రూ.7వేల వరకు ఖర్చు వస్తోంది. ప్రస్తుతం చేను ఇంకా తడిగానే ఉంది. దీంతో గడ్డి మందు పిచికారీ చేస్తున్నాం. గ్రామాల్లో వరి నాట్లు వేస్తుండడంతో కలుపుతీతకు కూలీలు దొరకడం లేదు. దీంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు.

- నారాయణ, గురుడుపేట్

ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు శ్రద్ధగా వినాలి

రెబ్బెన: ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని జ్ఞానాన్ని పెంచుకోవాలని రెబ్బెన కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు విజయరాణి అన్నారు. మండలంలోని పుంజుమేరగూడలో శనివారం రీడింగ్ క్యాంపెయిన్ నిర్వహించారు. రూం టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి సెప్టెంబర్ 8 వరకు మేక్ రూం ఫర్ ఎర్లీ లెర్నింగ్ థీమ్‌గా ఉంటుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయురాలు మౌనిక, కాంప్లెక్స్ సీఆర్పీ దేవేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

వాంకిడి: మండలంలోని సరాండి గ్రామంలో శనివారం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు, పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. హెచ్‌ఈవో రవిదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నో బ్యాగ్‌డే పాటించాలి


విద్యార్థులను చదివిస్తున్న ఎంఎన్‌వో ప్రకాశ్

కెరమెరి: నో బ్యాగ్ డేను అన్ని పాఠశాలలు పాటించాలని ఎంఎన్‌వో ఆడే ప్రకాశ్ అన్నారు. శనివారం మండలంలోని ఉమ్రి, సీంగూడ, అగుర్‌వాడ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా టీచర్లు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులతో చదివించారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు

కౌటాల మండల కేంద్రంలోని మయూరి విద్యాలయం, శ్యామ్ మోడల్, వాహిని పాఠశాలలతో పాటు జైనూర్ మండల కేంద్రంలోని భారతి గ్రామర్ పాఠశాలలో శనివారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఉట్టి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు కృష్ణుడు గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. వేడుకలతో పాఠశాలల్లో సందడి వాతావరణం నెలకొంది. -కౌటాల/జైనూర్


జైనూర్‌లో వేషధారణలో చిన్నారులు


కౌటాలలో..